విశాలాంధ్ర విశాఖపట్నం
ఆదివారం 12, మే, 2024

కార్మిక నేత గంగాధర్ రెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర - భీమిలి: చిట్టివలస జూట్ మిల్ కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షులుగా దివంగత ఎస్.గంగాధర్ రెడ్డి ఏడవ వర్ధంతిని తగరపువలసలో ఉన్న కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూట్ కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ఎస్.గంగాధర్ రెడ్డి మొదటిసారిగా 1974లో చిట్టివలస జూట్ మిల్ స్టాఫ్ యూనియన్ పెట్టి వారి హక్కుల కోసం ఉద్యమించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంఘ అధ్యక్షుడు జేవీ కైలాస్ రెడ్డి, దల్లి అప్పల రెడ్డి, ఎం.ఆదినారాయణ రెడ్డి, ఎస్.వరాహమూర్తి రెడ్డి, ఎస్.శంకర్ రెడ్డి, జి.అప్పారావు, ఆదిరెడ్డి, జీరు అబ్బిరెడ్డి, సిహెచ్ గణేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారం

- ఇప్పటికే దాదాపు ఓటర్లకు తాయిలాలు పంపిణీ పూర్తి
- వినూత్న రీతిలో ప్రచారాలు చేపట్టిన అభ్యర్థులు

ప్రచార సమయం ముగియడంతో మైకులు ఇప్పేస్తున్న నిర్వాహకులు.

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు చివరి దశకి చేరుకున్నాయి. సోమవారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం ఐదు గంటలతో గడువు ముగిసింది. ఎక్కడ ప్రచారం అక్కడ గప్ చుప్ అన్న రీతిలో నగరం అంతా మూగ బోయింది. గత రెండు నెలలుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన అభ్యర్థులకు ఆఖరి అంకం దశకు చేరుకున్నారు. ఇప్పటికే అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థులు తాయిలాలు పంపిణీ పూర్తి చేశారు. ఓట్లకు నోట్లు వెదజల్లారు. అధికార పార్టీ అభ్యర్థులు రెట్టింపు స్థాయిలో ఎన్నికల ప్రచారంతోపాటు ఖర్చు నిర్వహణ అధికంగానే పెట్టారని తెలుస్తుంది. ఇక ఓటర్లను కూడా అదే స్థాయిలో కొనుగోలు చేస్తూ విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంపిణీకి అర్ధరాత్రి పూట తెర లేపారు. ఈనెల 13 సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో అభ్యర్థులు ఇక తాయిలాల వంపకంలో తల మునకలై, అర్ధరాత్రి తమ అనుచర వర్గంతో ఓటరు స్లిప్పులతో ఇంటింటికి వెళ్లి డబ్బులు పంపిణీలో మునిగి తేలిపోతున్నారు. ప్రతి అభ్యర్థి వందల సంఖ్యలో ప్రచార వాహ నాలను వాడుతూ తమ నియోజకవర్గ పరిధిలో బాకా ప్రచారాన్ని విస్తృతంగానే నిర్వహించారు. వినూత్న రీతిలో ప్రచారాన్ని హెూరెత్తించారు. దోశలు వేస్తూ, ఇస్త్రీ చేస్తూ, ఇటికలు మోస్తూ, చెత్తలో ఊడుస్తూ, అనేకమంది కు కాళ్లకు నమస్కారాలు చేస్తూ ఓటేయమని ప్రాధేయపడుతూ అభ్యర్థులు పడరాని పాట్లు పడి ప్రచారాన్ని నిర్వ హించారు. మండుటెండను సైతం లెక్క చేయ కుండా పగలు, సాయంత్రం, రాత్రి 10 గంటల వరకు ప్రచారం నిర్వహిస్తూ, అనేక కుల, వర్గ సమావేశాలు నిర్వహిస్తూ, ప్రార్థనా మందిరాలు వద్ద పూజలు చేయించుకుంటూ, గెలుపు కోసం ప్రతి అభ్యర్థి అనేక చోట్ల విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఇక కొంత మంది అభ్యర్థుల కుటుంబ సభ్యులకు కూడా ఇంటిల్లపాది తమదైన శైలిలో ప్రచారాన్ని ఇంటింటికి తిరిగి చేపట్టారు. మరి కొంతమంది అభ్యర్థులకు సినీ తారలు, క్రీడాకారులు, సెలబ్రిటీలు, సైతం ప్రసారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో పాటు ఖజఖనేతలు, సీపీఐ, సిపిఎం, వంటిల్లు పార్టీ అధినేతలు కూడా విశాఖలో విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. విశాఖ జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో ప్రతి వాడలో రాజకీయ ప్రచారాన్ని హోరెత్తించారు. మొత్తానికి ఎన్నికల ప్రచారం వినూత్న రీతిలో వివిధ రూపాల్లో ఓటర్లను ఆకర్షించేలా చేసినప్పటికీ, ఓటర్లు అభ్యర్థులు ఎన్ని కుస్తీలు పడిన, ఎన్ని కుయుక్తులు చేసిన తాము అనుకున్న వారికే ఓటు వేస్తారనేది నగ్న సత్యంగా మారింది.

ఓటుకు నోటు అధిక ప్రభావం చూపుతోందని ఆశించిన వారికి ఓటర్లు తగిన రూపంలో తీర్పునిస్తారని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికల్లో ధన రాజకీయాలు దురదృష్టకరం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - విశాఖ: ఈ ఎన్నికల్లో ధన రాజకీయాలు అధికం కావడం దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం విపరీతంగా డబ్బులు పంచారని, విశాఖ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సిపిఐ మాత్రమే ఏడు కరపత్రాలను ప్రతి గుమ్మానికి అందజేసిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో రాజకీయ అంశాలు మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలకు దిగడం దురదృష్టకరమని అన్నారు. ఎన్నికల్లో ఓటమి ఖాయమని కేంద్రంలోని నరేంద్ర మోడీకీ, రాష్ట్రంలో జగన్ కీ అర్థమైందని, మోడీ ఓట్ల కోసం మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తుంటే జగన్ ప్రసంగాల్లో నిరాశా, నిస్పృహలు కనిపిస్తున్నాయని చెప్పారు. పదేళ్లపాటు ప్రధాని పీఠంపై కూర్చున్న నరేంద్ర మోడీ పదేళ్ల కాలంలో చేసిన పనుల గురించి చెప్పకుండా మత పరమైన భావోద్వేగాలు రెచ్చగొట్టేలా ప్రసంగిస్తున్నారని అన్నారు. గత పది ఏళ్లలో ఉపాధి హామీ పథకం కార్మికులు పెరిగారని, కేంద్రం మాత్రం ఆ పథకానికి నిధుల కేటాయింపును తగ్గించిందని, దీంతో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగాయని అన్నారు. ప్రతి ఇంటికీ గ్యాస్ స్టౌ ఇచ్చామని, గ్యాస్ ధర కూడా తగ్గించామని మోడీ అబద్ధాలు చెబుతున్నారని.., పదేళ్ల క్రితం సిలిండర్ ధర 410 రూపాయలు ఉంటే నేడు 1200 రూపాయలకు పెరిగిందని చెప్పారు. ఎన్నికల ముందు స్వల్పంగా ధర తగ్గించారని విమర్శించారు. ప్రజలు ఈ అబద్ధాలను నమ్మరని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఇల్లు గడవడం కోసం దాచుకున్న డబ్బును బయటకు తీసి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. బిజెపికి చెందిన బ్రిజ్ భూషణ్ పై రెజ్లర్లు లైంగిక వేధింపుల ఆరోపణలు చేసినా బిజెపి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నిన్ననే బ్రిజ్ భూషణ్ పై కోర్టు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన మూడు విడతల పోలింగ్ లో బిజెపికి పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నా విషయం అర్థమైందని చెప్పారు. రాష్ట్రంలో జగన్ ప్రజలపై విద్యుత్ ఛార్జీలు ఏడుసార్లు పెంచి, చెత్త పన్ను విధించి, ఆస్తి పన్ను పెంచి భారీగా భారాలు మోపారని అన్నారు. రాష్ట్రంలోని తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలకు అపవిత్ర కలయిక అని విమర్శించారు.

గతంలో మోడీని ఎన్నోసార్లు విమర్శించిన చంద్రబాబు అవకాశవాదంతో బిజెపితో కలిసారని చెప్పారు. సిపిఐ, కాంగ్రెస్, సిపిఎం, అమ్ ఆద్మీ, సమాజ్ వాది పార్టీ, ఎన్ సి పి, శివసేన, డిఎంకె, ఆర్జేడి తదితర పార్టీల ఇండియా కూటమికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందని అన్నారు. కేజ్రీవాల్‌కి బెయిల్ రావడం మోడీకి చెంప పెట్టని అన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలను గుప్పెట్లోకి తీసుకొని వ్యతిరేకులను వేధిస్తున్నారని విమర్శించారు. విదేశాల ప్రశంసలను స్వీకరిస్తున్న మోడీ విమర్శలను స్వీకరించలేకపోతున్నారని అన్నారు.

కేజ్రీవాల్ అరెస్టుపై విదేశాల నుంచి వచ్చిన విమర్శల విషయంలో తమ ఆంతరంగిక వ్యవహారం అని చెప్పడాన్ని తప్పుపట్టారు. వారసత్వ రాజకీయాలను విమర్శిస్తున్న బిజెపి తమ పార్టీలో సీనియర్ నేతల వారసులకు టికెట్లు ఇవ్వడం ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, విశాఖ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి అత్తిలి విమల, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జే అచ్యుతరావు పాల్గొన్నారు.

యాదవ జగ్గరాజుపేటలో అమర్నాథ్ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - గాజువాక: స్థానిక 88వ వార్డు యాదవ జగరాజుపేటలో పార్టీ ఇన్‌చార్జి జి.మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గాజువాక నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రాంతంలో అనేకమంది ఇళ్ల నుంచి బయటికి వచ్చి అమర్నాథ్‌కు స్వాగతం పలికారు. అనంతరం అమర్నాథ్ మాట్లాడుతూ తనను ఎన్నికల్లో గెలిపిస్తే ఈ ప్రాంతంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందని, సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగు తాయని ఆయన చెప్పారు. పథకాలన్నీ మహిళల పేరిటే మంజూరు చేయటం వలన అనేక కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అయ్యాయని అమర్నాథ్ వివరించారు. జగన్మో హన్ రెడ్డి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, మాజీ మేయర్ పులుసు జనార్ధన్రావు, ఉరుకూటి అప్పారావు, వెంకటేష్, మాడిస అప్పలరాజు, ఏదూరి శ్రీనివాస్, నమ్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో విచిత్ర చేరికలు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీలో శనివారం విచిత్రమైన చేరికలు చోటుచేసుకున్నాయి. కూటమి అభ్యర్థులే కూటమిలో ఉన్న మరో పార్టీ కండువాలు కప్పుకోవడం జరిగింది. భీమిలి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సమక్షంలో పాండ్రంగి నుంచి కొంతమంది టీడీపీ కూటమి సభ్యులు, కూటమేతర సభ్యులు శనివారం టిడిపి కండువా వేసుకోవడం పాండ్రంగి గ్రామంలో స్థానికులు సోషల్ మీడియాలో వచ్చిన ఫోటోల ఆధారంగా చూసి నవ్వుకున్నారు. కూటమిలో ఉన్న జనసేన సభ్యులు టీడీపీ కండువా కప్పుకోవడం అలాగే బిజెపి సభ్యులు టీడీపీ కండువాలు కప్పుకోవడం కనీసం

కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా కూటమేతర పార్టీ వ్యక్తులు టిడిపి కండువా కప్పుకోవడం చాలా ఆశ్చర్యానికి గురి చేసిందని స్థానికులు మాట్లాడుకుంటున్నారు. కుటుంబ సభ్యులైతే వాళ్ళ కండువాలు కప్పుకున్న విషయం తెలిసినప్పటికీ శనివారం వైసిపి లో జోరుగా ప్రచారం చేశారు. స్థానిక వైసీపీ నాయకులు మాట్లాడుతూ గంటా చేరికలంటే పట్టుమని పది ఓట్లు కూడా వేయించలేని వాళ్ళతో కండువాలను మార్పించుకోవడమేనని అన్నారు. ఏ పార్టీకి ఉపయోగం లేని వారితో కండువాలు మార్పించడం వల్ల గంట శ్రీనివాసరావు కుక్కతోక పట్టి గోదావరి ఈదినట్లే అని అన్నారు.

సర్కారు మద్యం దుకాణాల వద్ద మందుబాబులు హడావిడి

విశాలాంధ్ర - ఆనందపురం: ఈనెల 13వ తేదీ ఎన్నికల నేపథ్యంలో రానున్న మూడు రోజులు సెలవు ప్రకటించడంతో మందుబాబులు ఉదయం నుంచే వైన్ షాపుల వద్ద పడిగాపులు కాశారు. సార్వత్రిక ఎన్నికలు పుణ్యమా అని మద్యం ప్రియులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఒక వైపు నల్ల బజారు, మరో వైపు మద్యం ప్రియులకు కావల్సిన బ్రాండ్ లేక మందు బాబులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల రోజుల్లో మద్యం దుకాణాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో, ప్రభుత్వ దుకాణాల వద్ద శుక్రవారం ఉదయం నుండి వినియోగదారులు బారులు తీరారు. ఇందులో రోజూ మద్యం సేవించే వారి కంటే, నల్ల బజారుకు తరలించే వారే ఎక్కువ య్యారు. ప్రభుత్వ దుకాణాల్లో లభించని బ్రాండ్లు, నల్ల బజారు లోను, గొలుసు దుకాణాలు, పాన్ షాపుల్లోనూ దొరుకుతుం డటంతో మద్యం ప్రియుల జేబులు, ఆరోగ్యం గుల్ల అవుతోంది. నల్ల బజారు, గొలుసు దుకాణాల్లోనూ మద్యం అమ్మకాలు పై నియంత్రణ చేయలేని ప్రభుత్వ అధికారుల అసమర్థతా, లేక నెల వారి మామూళ్లేనా అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. తక్షణమే ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, మద్యం ప్రియులు జేబులు, ఆరోగ్యాన్ని కాపాడవలసిందిగా ప్రజా, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ తీసుకొని అక్రమంగా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

జిల్లా ఎన్నికల అధికారి డా.ఎ.మల్లికార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులందరూ అన్ని చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఎ.మల్లి కార్జున సూచించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మంది రంలో శనివారం ఉదయం ఈ మేరకు వివిధ ఎన్ఫోర్స్మెంట్ విభాగాల అధికారులతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. మే 13న జిల్లాలో జరిగే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వ హిం చేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంటు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ, పోలీసు పరిశీలకులు అమిత్ కుమార్, వ్యయ పరిశీలకులు రెంగ రాజన్, ఎస్.కోట, పశ్చిమ, గాజువాక నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు సీతారామ్ జాట్, భీమిలి, తూర్పు, దక్షిణ నియోజ కవర్గాల వ్యయ పరిశీలకులు సౌమ్య పాండే జైన్, ఉత్తరం, పశ్చిమ, గాజువాక, పెందుర్తి వ్యయ పరిశీలకులు అక్షా జైన్, పోలీస్ కమిషనర్ డా. ఎ.రవి శంకర్‌లు వివిధ అంశాలపై మాట్లాడారు. సమావేశంలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున జిల్లాలో చేపట్టిన చర్యల గురించి పీపీటీ ద్వారా వివరించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల వసతులు సమకూర్చామని పేర్కొన్నారు. అధికారులంతా ఎన్నికల కమిషన్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని, ఎన్నికల విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అన్ని రాజకీయ పరమైన కార్యకలాపాలపై పటిష్ట నిఘా ఉంచాలని సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ సూచించారు. జాయింట్ పోలీసు కమిషనర్ ఫక్కీరప్ప, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థి విమలను గెలిపించండి

విశాలాంధ్ర - మల్కాపురం: ఎన్నికల్లో ఇండియా కూటమి బలపరచిన సీపీఐ పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమలను అత్యధిక ఓట్లతో గెలిపించాలని సీపీఐ, ఏఐటీయూసీ నేతలు ప్రజలను కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం హిందుస్తాన్ జింక్ గేట్ వద్ద నుండి షిప్ యార్డ్ గేట్ వరకు పశ్చిమ నియోజక వర్గ పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ఇండియా కూటమి గెలుపుతోనే మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని అన్నారు. చట్ట సభల్లో కమ్యూని స్టులకు ప్రాధాన్యత ఉండాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలో నిలిచామని అన్నారు. ఈ ఎన్నికల్లో సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమలను అత్యధిక ఓట్లతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ర్యాలీలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కె.రాజబాబు, సిపిఐ నాయకులు తాండ్ర కనక రాజు, జి.ఆనంద్, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగులు గెద్దయ్య, కృష్ణ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అవంతి భారీ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - భీమిలి: 48వ రోజు భారీ బైక్ ర్యాలీని జీవీఎంసీ భీమిలి జోన్ వార్డులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పాలనలో దళారీ వ్యవస్థతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని వైసిపి ప్రభుత్వం జగనన్న పాలనలో వాలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా మా వద్దకే ప్రతి పథకం, ప్రతి సేవలో అందుతున్నాయని మళ్లీ ముఖ్య మంత్రిగా జగనన్న రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలియ జేశారు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనను తన ఊపిరిగా చేసుకొని పేద బడుగు బలహీన వర్గాల వారి అభివృద్ధి శ్రేయస్సే ధ్యేయంగా ప్రజల పక్షాన ఓ సైనికుడిలా పాలనతో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని తెలియజేశారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అంద జేశామని మా వలన మేలు జరిగిందంటే మాకు తప్పనిసరిగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమిలి జోన్ వార్డు వైసిపి శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి గెలుపుతోనే బీసీలకు న్యాయం

విశాలాంధ్ర - ఆనందపురం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపుతోనే బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు అధ్యక్షతన విశాఖ టీడీపీ కార్యాలయంలో శాసన మండలి సభ్యులు దువ్వరపు రామారావు, విశాఖ పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీతో కలసి సమావేశం జరిగింది. అందరం కలిసి కూటమి అభ్యర్థులను గెలిపించి రాబోయే రోజులలో ఆదరణ, బీసీ పథకాలు, బీసీ సబ్ ప్లాన్ నిధులు స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర పొలిటికల్ జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాస నాయుడు, విశాఖ గౌరవ అధ్యక్షులు కామన వెంకట సుబ్బారావు, కార్యదర్శి బలగ సుధాకర్, ప్రసాద్, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు విజయ కుమార్, కార్యదర్శి మధు, హేమంత్, పితాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయ దుందుభి ఖాయం

బైక్ ర్యాలీ ప్రారంభోత్సవంలో గంటా

విశాలాంధ్ర - పీఎం పాలెం: రాష్ట్రంలో కూటమి విజయ దుందుభి మోగించనుందని భీమిలి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలిలో రికార్డు స్థాయి మెజారిటీతో ఆశీర్వదించడానికి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజైన శనివారం మధురవాడ క్రికెట్ స్టేడియం వద్ద కుమారుడు గంటా రవితేజతో కలిసి బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బైక్ ర్యాలీకి రవితేజ నాయకత్వం వహించి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. మండుటెండను సైతం లెక్క చేయక భారీగా యువత ర్యాలీలో పాల్గొని టిడిపి అనుకూలంగా నినాదాలు చేశారు. బైక్ ర్యాలీ పి.ఎం.పాలెం, మధురవాడ, కొమ్మాది, ఆనందపురం, తగరపువలసల మీదుగా భీమిలి వరకు సాగింది. ర్యాలీలో పాల్గొన్న గంటా శ్రీనివాసరావు మనవలు అందరి దృష్టిని ఆకర్షించారు. ఎంపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీభరత్ కూడా ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు.

ఎంపీతో పాటు ఏడు నియోజకవర్గాల్లోను గెలుస్తాం



విశాలాంధ్ర - పెందుర్తి: అనకాపల్లి ఎంపీ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను భారీ మెజారిటీతో ఎన్డీఏ కూటమి గెలుచుకుంటుందని పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు స్పష్టం చేశారు. సుజాతనగర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 43 రోజులుగా తాను సాగిస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే సాగించిన అక్రమాలు దోపిడీలతో విసిగిపోయిన ప్రజలు ఎన్డీఏకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఎంపీగా సీఎం రమేష్ గెలిస్తే అనకాపల్లి జిల్లా రూపు రేఖలను మారుస్తారని, అలాగే తాను ప్రభుత్వంలో పరపతి ఉపయోగించి పెందుర్తి నియోజకవర్గాన్ని విద్య, వైద్య, పారిశ్రామిక హబ్బులుగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఎన్డీఏ కూటమి ప్రకటించిన మేని ఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తుందని తెలిపారు. సంక్షేమ పథకాలను రెట్టింపు చేయడంతోపాటు, సంపద సృష్టించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సహాయ సహకారాలతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాలను అగ్ర పథంలో నిలబెడతామన్నారు. మీడియా పట్ల తనకు అపార గౌరవం ఉందని వారి సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

గాజువాకలో కూటమి కార్యకర్తల మహార్యాలీ

విశాలాంధ్ర – గాజువాక: సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వానికి సమయం ముగుస్తున్న నేపథ్యంలో గాజువాకలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ గాజువాకలో మూడుపార్టీల నాయకులు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది బైకులు పదుల సంఖ్యలో కార్లతో వేలాదిమంది కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు ఈ ర్యాలీ జై పల్లా, జై భరత్ నినాదాలతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావులు పాల్గొని కార్యకర్తలు అభిమానులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక వైసిపి పాలనతో విసుగుచెందిన ప్రజలు ఫ్యాను రెక్కలు విరగ్గొట్టి, కూటమికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇటీవల విడుదలైన అన్ని సర్వేలలోనూ కూటమి ప్రభుత్వం ఖాయమని స్పష్టం కావడంతో వైసిపి నేతల్లో గుబులు మొదలైందని అన్నారు. నేటితో ప్రచారం ముగుస్తున్న తరుణంలో పోలింగ్ తేదీన ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి తమ ఓటుహక్కుని వినియోగించుకునే విధంగా నాయకులు, కార్యకర్తలు చర్యలు చేపట్టాలని తద్వారా కూటమి అభ్యర్థులుగా తమ అఖండ విజయానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేసారు. ఇదే ఉత్సాహంతో జూన్ నాలుగవ తేదీన విజయోత్సవర్యాలీ నిర్వహించుకుందామని వారు పిలుపునిచ్చారు. స్థానిక అగనం పూడి కూడలివద్ద ప్రారంభమైన ర్యాలీ దువ్వాడ, రాజీవ్ నగర్, కూర్మన్నపాలెం, వడ్లపూడి, పాతగాజువాక, శ్రీనగర్, కొత్తగాజువాక, పెదగంట్యాడ ,గంగవరం, వంటిల్లు కూడలి మీదుగా పాతగాజువాక వరకు సాగింది. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

4 పాయింట్ 2 టెక్నాలజీస్ అభివృద్ధి చేసిన ఆగ్మెంటెడ్ రియాలిటీ

విశాలాంధ్ర – విశాఖపట్నం: 4 పాయింట్ 2 టెక్నాలజీస్ ప్రైవేట లిమిటెడ్ ను అగ్మెంటెడ్ రియాలిటీ అభివృద్ధి చేసినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 4పాయింట్2 టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, చైర్మన్, ఎండీ కే.శివకుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ సాంకేతికతను అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉన్నామ న్నారు. మా కంపెనీ రాజకీయ ప్రచారాలతో నిమగ్నమయ్యే విధానంలో విప్లవాత్మకమైన వినూత్నమైన అగ్మెంటెడ్ రియ లిటీ టెక్నాలజీ అభివృద్ధి చేశామన్నారు. ఈ టెక్నాలజీ లక్షణాలలో ఒకటైన హోలోగ్రాఫిక్ ప్రసంగం అన్నారు. ఈ టెక్నాలజీని అభ్యర్థులు, మద్దతుదారులు, అనుచరులు ఉపయోగించవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం www.manacbn.comలో సంప్రదించాలన్నారు.

ఆసక్తికరంగా గుంటూరు ఫ్యామిలీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర – పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుంటూరు వెంకట నరసింహారావు ఎన్నికల ప్రచారం ఆసక్తికరంగా సాగింది. సతీమణి భారతి, కుమార్తె పూజిత, ఇతర కుటుంబ సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి తమ ఎన్నికల విధానాన్ని వివరించారు. అభిమానులు, మద్దతు దారులతో కలిసి పెందుర్తి, సబ్బవరం

పరవాద మండలాల్లో విస్తృతంగా పర్యటించి మన పెందుర్తి మన అభివృద్ధి నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. అధికార ప్రతిపక్ష అభ్యర్థులను గట్టిగా విమర్శిస్తూనే తాను చేపట్టబోయే అభివృద్ధిని వెల్లడించారు. శనివారం ఉదయం సరిపల్లి జంగాలపాలెం గ్రామాలలో పర్యటించిన గుంటూరు వెంకట నరసింహారావు కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి ఓటింగ్ విధానాన్ని వివరించారు. అలాగే ఆయన సతీమణి భారతి జీవీఎంసీ 94 వ వార్డు బంట కాలనీలో పర్యటించి ఉంగరం గుర్తు పై ఓటేసి గుంటూరు వెంకట నరసింహారావును భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆమెతో పాటు కుటుంబ సభ్యులు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంజి శతాబ్ది ఉత్సవాలు

విశాలాంధ్ర – విశాఖపట్నం: ఎం.జి(మోరిస్ గ్యారేజ్ లు), 100 సంవత్సరాల వారసత్వం గల బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్, ఈరోజు 100-సంవత్సరాల లిమిటెడ్ ను విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. 110 సంవత్సరాల బ్రిటిష్ రేసింగ్ చరిత్రకు మారు పేరుగా నిలిచిన దిగ్గజవు ఎవర్ గ్రీన్ రంగును పరిచయం చేసిందన్నారు. ఈ సందర్భంగా సతీందర్ సింగ్ బజ్వా, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్, ఎంజి మోటార్ ఇండియా, మాట్లాడుతూ "మా 100 సంవత్సరాల లిమిటెడ్ ఎడిషన్ విడుదల మా దీర్ఘకాల వారసత్వానికి ఆటోమోటివ్ శ్రేష్ఠత కోసం అభిరుచికి రుజువుగా నిలిచిందన్నారు. 'ఎవర్ గ్రీన్' రంగు మా హృదయాల్లో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉందన్నారు. బ్రాండ్ ను నిర్వచించే పెర్ఫార్మెన్స్ వారసత్వం యొక్క స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని గుర్తు చేసుకున్నారు. తమ సుసంపన్నమైన వారసత్వం కోసం పేరు పొందిన బ్రాండ్ గా,ఎంజి తమను తాను స్థిరపరచుకునే లక్ష్యాన్ని కలిగి, రాబోయే సంవత్సరాల్లో కస్టమర్స్ కోరుకున్న విధంగా కొనసాగిస్తుందని వివరించారు.

గాజువాకలో పల్లా శ్రీనివాస్ గెలుపు తథ్యం

విశాలాంధ్ర – విశాఖ సిటీ: రాష్ట్రాన్ని ఐదు సంవత్సరాల పాటు అన్ని విధాలా నాశనం చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి కావాలో.. ఆంధ్రప్రదేశ్ ని స్వర్ణాంధ్రప్రదేశ్ తీర్చిదిద్దే నారా చంద్రబాబునాయుడు కావాలో ప్రజలే తేల్చుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పిలుపునిచ్చారు. ఆదివేదింగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసి కనీసం స్టీల్ ప్లాంట్ ని కూడా కాపాడుకోలేని అమర్నాథ్ కావాలో.. అభివృద్ధి ధ్యేయంగా పనిచేసే పల్లా శ్రీనివాస్ కావాలో తేల్చుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు

నగరంలో సెక్టార్ 4, 5 లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ.. రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం, జనసేన, బిజెపి కలగలిసిన కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఇదే క్రమంలో గాజువాకలో కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 175 కు 175 అసెంబ్లీ నియోజకవర్గాలలోగా గెలిచి తీరుతామని చెబుతున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి తన సొంత నియోజకవర్గం పులివెందులలోనే ఓటమి తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో మండవ జ్యోతి, ఎస్.భార్గవి, ఏ.మని కుమార్, బి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేసే వారినే గెలిపించుకుందాం

విశాలాంధ్ర – భీమిలి: ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టో రూపంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నీతిగా నిజాయితీగా అమలు చేస్తున్నది మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్కరే అని విశాఖపట్నం పార్లమెంటు అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. భీమిలి నియోజకవర్గంలో పీఎం పాలెం ప్రాంతంలో అసెంబ్లీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ ప్రచారంలో మాట్లాడుతూ ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్నకు మనమంతా అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలను అడ్డం పెట్టుకుని, వాలంటీర్ల ద్వారా పెన్షన్లు ఇతరత్రా సేవలు అందకుండా చేసిన ప్రతిపక్ష పార్టీలు, పొరపాటున అధికా రంలోకి వస్తే సంక్షేమ పథకాలు అన్నిటికీ తూట్లు పొడు స్తారని ఆమె హెచ్చరించారు. అటువంటి వారి యత్నాలకు తావివ్వకుండా ఓటు ద్వారా బుద్ధి చెప్పి ఆ పార్టీలను బంగాళాఖాతంలో కలిపేయాలని పిలుపునిచ్చారు. విశాఖ అభివృద్ధికి కంకణం కట్టుకుని ఉన్న జగన్మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుని ఉత్తరాంధ్రని అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశారు. విశాఖలోనే ప్రమాణం చేస్తానని, పరిపాలన రాజధానిగా చేస్తానని విస్పష్టంగా ప్రకటించిన జగన్మోహన్

రెడ్డిని బలపరిచి మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని కోరారు. విశాఖ ఆదివాదుచు గా ఫుట్టింటికి సేవ చేసే భాగ్యం తనకు జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చారని ఆయన ఆశీర్వాదంతో ఎంపిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆదరించాలని, అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల ప్రచారంలో మేయర్ హరి వెంకట కుమారి, కార్పొరేటర్ ప్రియాంక తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కిరాణా స్టోర్లు బీ2బీ ఈ-కామర్స్ ఆఫర్ల స్వీకరణ

విశాలాంధ్ర – విశాఖపట్నం: వేగంగా అభివృద్ధి చెందు తున్న మార్కెట్ అనుగుణంగా సేవలు, సౌకర్యాలు అందిం చడంలో కిరాణా యజమానులు రాణిస్తున్నప్పటికీ, సంప్ర దాయ వ్యాపార పద్ధతులు కొన్నిసార్లు పురోగతికి ఆటంకం కలిగిస్తాయని సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. అద్భుతవశాత్తూ బీ2బీ ఈ-కామర్స్ ప్లాట్ ఫా రమ్ లు కిరాణా స్టోర్లలో కార్యకలాపాలను క్రమబద్ధీ కరించడానికి, శక్తివంతమైన పరిష్కారాలను అందిస్తున్నా యన్నారు. కిరాణా స్టోర్లకు బీ2బీ ఈ-కామర్స్ అందించే ఆరు ప్రాథమిక ప్రయోజనాలున్నాయన్నారు. షెడ్యూల్ చేయబడిన డెలివరీల కోసం ఎంపికలతో పాటు విలువైన సమయాన్ని ఆదా చేయవచ్చన్నారు. సాంప్రదాయకంగా, కిరాణా స్టోర్లు పరిమితమైన స్థానిక పంపిణీదారులపై ఆధారపడతాయ న్నారు. ప్లాట్ ఫారమ్ లు రియల్ టైమ్ ఇన్వెంటరీ ట్రాకింగ్ టూల్స్ అమ్మకాల డేటా ఆధారంగా ఆటోమేటెడ్ ఇన్వెంటరీ రీఆర్డరింగ్ వంటి విలువైన వనరులను అందిస్తాయని వివరించారు.ఈ ప్లాట్ ఫారమ్ లు కిరాణా స్టోర్ లను వారి ఇళ్ల సౌలభ్యం నుండి 24/7 ఆర్డర్లను ఇవ్వడానికి వీలు కల్పిస్తాయని, ఇంటర్నెట్ కనెక్షన్ మాత్రమే అవసరమన్నారు.

భీమిలిలో టీడీపీ చేతులెత్తిసిందా..?

తప్పుడు ఎస్ఎంఎస్ సమాచారం

విశాలాంధ్ర – మధురవాడ: భీమిలి నియోజకవర్గం మధురవాడలో పోలింగ్ బూత్ చిరునామా తప్పుగా టిడిపి వారు ఎస్ఎంఎస్ పంపిన విషయం వెలుగు చూసింది. దీనితో కూటమి టిడిపి అభ్యర్థి తన గెలుపుపై ఆశలు వదులుకొని ఓటర్లకు పోలింగ్ బూత్ చిరునామా విషయంలో తప్పుడు సమాచారాన్ని ఎస్ఎంఎస్ ద్వారా తన వెబ్సైట్ ద్వారా పంపిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భీమిలి (20) శాసనసభ నియోజక వర్గం 311వ పోలింగ్ బూత్ జీవీఎంసీ 5వ వార్డు వైయస్ఆర్ కాలనీ 1086073 సచివాలయంలో ఉంది. ఆ బూతులో క్రమసంఖ్య 1051గా ఎస్ఎంఎస్ 2663805 ఓటర్ గుర్తింపు కార్డు గల కృష్ణారావు బొబ్బ అనే వ్యక్తికి ఓటు ఉంది. కాగా అదే ఓటరుకు అతని ఎస్ఎంఎస్ కు ఆయన ఓటు వేయవలసిన ఎస్ఎంఎస్ 311 పోలింగ్ బూత్ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనంలో ఉన్నట్లు శనివారం సాయంకాలం నాలుగు గంటల ప్రాంతంలో టిడిపి వారు ఎస్ఎంఎస్ మెసేజ్ ను పంపించారు. ఆ మెసేజ్ ను చూసిన ఓటరు సంబంధిత సచివాలయానికి వెళ్లి బూత్ స్థాయి అధికారులను సంప్రదించగా, ఆ ఎస్ఎంఎస్ సమాచారం తప్పుడుదని బి ఎల్ఓ నిర్ధారించారు. ఇలా పోలింగ్ బూత్ ల చిరునామా తప్పుడు సమాచారాన్ని ఎంతోమంది ఓటర్లకు పంపించి వుండవచ్చు. ఇటువంటి తప్పుడు సమాచారాలతో ఓటర్లను అయోమయానికి గురిచేయడంలో టిడిపి వారికి భీమిలి నియోజకవర్గంలో తమ విజయం పట్ల ఆశలు సన్నగిల్లాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాలు ఓటర్లపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తాయో సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్లో వ్యక్తం అవుతుంది. ఫలితాల వరకు ఎదురు చూద్దాం.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయబోనని కేంద్రం ప్రకటించాలి

ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ప్రధాని స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించండి... పోటీనుంచి తప్పుకుంటామని విశాఖ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమరనాథ్ వేలాది మంది స్టీల్ కార్మికుల సమక్షంలో స్పష్టం చేశారు. కూటమి తరపున పోటీచేస్తోన్న వారికి ఈ ఇరువురు నేతలు సవాల్ విసిరారు. మరో 36 గంటలు పోలింగ్ కు సమయం వుందని పోటీ నుంచి తప్పుకునేందుకు మేము సిద్ధం అని కుండ బద్దలు కొట్టారు. శనివారం ఉదయం స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల మద్దతు కోరుతూ ప్లాంట్ బీసీ గేట్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్ లో గాజువాక అసెంబ్లీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ తో కలిసి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమికి వేటు వేస్తే, స్టీల్ ప్లాంట్ ను అమ్మేసుకున్నట్లే అని, రాష్ట్రానికి వచ్చిన ప్రధాన మంత్రి మోదీ, విశాఖ ప్రజల సెంటిమెంట్ ను ఏమాత్రం పట్టించు కోలేదన్నారు. స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. పోరాడి సాధించుకున్న స్టీల్ ప్లాంట్ ను కాపాడుకుందామని, ఎన్నో గ్రామాలు ఖాళీ చేసి మరీ ఏర్పాటు చేసిన ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తే ఎవరూ క్షమించరన్నారు.

ఈ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుతున్నది ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నని, స్వయంగా ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేయడంతోపాటు, అసెంబ్లీ సైతం తీర్మానం చేసి చిత్తశుద్ధి చాటుకున్నారన్నారు. గతంలో తాను బొబ్బిలి ఎంపిగా ఉన్నప్పుడు స్టీల్ ప్లాంట్ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తి, మినీ నవరత్నాల స్థాయి నుండి దీనిని నవరత్నాల్లో ఒకటిగా నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించానని, అలాగే గనుల కేటాయింపు పై కూడా అనేక సందర్భాల్లో, పలు వేదికల్లో ప్రస్తావించానన్నారు. ఉత్త రాంధ్ర ప్రతినిధిగా ఆనాడు ప్లాంట్ అంశంపై మాట్లాడా నని, ఇప్పుడు విశాఖ పార్లమెంటు ప్రతినిధిగా అవకాశమిస్తే మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తానని ఆమె భరోసా ఇచ్చారు. ఓటమి భయంతో కూటమి కట్టి, స్టీల్ ప్లాంట్ కార్మికులకు అన్యాయం చేస్తున్న పార్టీలకు గట్టి గుణపాఠం చెప్పాలని కోరారు. స్టీల్ ప్లాంట్ ను కాపాడటానికి, కార్మికుల పక్షంగా వారి గొంతుకను పార్లమెంటులో వినిపిస్తానని ఆమె అన్నారు. అదే సందర్భంగా మాట్లాడుతున్న ఎన్నికల్లో ఓటు వేసి తనను, గుడివాడ అమర్నాథ్ ను గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుర్నాధ రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, స్టీల్ ప్లాంట్ ఊరుకుటి అప్పారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల సీజన్ లో అధిక శక్తి కలిగే బాదంపప్పులు తీసుకోవాలి

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ప్రస్తుతం వున్న ఎండలు, సీజన్ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని మాక్స్ హెల్త్ కేర్ రీజినల్ హెడ్ ఆఫ్ డైటెటిక్స్ రితికా సమద్దార్ తెలిపారు. దేశంలో ఏప్రిల్ 19 నుండి జూన్ 1 వరకు ఏడు దశల్లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల మధ్య ఎక్కువ శాతం మంది బయట తిరిగే అవకాశాలు ఉంటాయని ఈ దశలో అధిక శక్తినిచ్చే ఆహారం తీసుకో వాల్సి ఉంటుందన్నారు. అధిక శక్తిని అందించే ఆహార పదార్థాలలో బాదం పప్పులు చాలా ముఖ్యమైనవన్నారు. బాదంలలో ప్రోటీన్, మెగ్నీషియం, విటమిన్ ఇ ఉన్నాయన్నారు. ఇతర కీలకమైన పోషకాలకు మూలకాలతో సమృద్ధిగా ఉండే బాదంపప్పులు సహజమైన దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయన్నారు. ఇది సాధారణ శ్రేయస్సుకు కూడా దోహ దపడుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు రోజంతా ఉత్సా హంగా శ్రద్ధగా ఉంచడానికి అనువైన ఆహారంగా బాదంలు నిలుస్తాయన్నారు.

వివాహితుడు అదృశ్యం

విశాలాంధ్ర – భీమిలి: భీమిలి మండలం చిన్ననాగ మయ్యపాలెంకు చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు భీమిలి పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న నాగమయ్యపాలెంకు చెందిన చల్లపల్లి నర్సింగరావు (28) దివిస్ కంపెనీలో పని చేస్తున్నాడు. కాగా ఆయనకు ఆరు నెలల క్రితం పారు అనే ఆమెతో వివాహం జరిగింది. కాగా ఈనెల 10వ తేదీన నర్సింగరావు డ్యూటీకి వెళ్ళేదుకు ఉదయం తొమ్మిది గంటలకు టిఫిన్ చేసి ఇంటి నుండి బయటకు వెళ్ళి రాత్రికి రాకపోవడంతో నర్సింగ్ రావు భార్య భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోజువారి ఆహారంలో పోషకాలను భాగం చేసుకోవాలి

విశాలాంధ్ర – విశాఖ సిటీ: రోజు తీసుకునే ఆహారంలో అధిక పోషకాలు కలిగిన గింజలను భాగం చేసుకోవాలని, మరి ముఖ్యంగా బాదములను తీసుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. మదర్స్ డే సందర్భంగా నగరంలో జరిగిన అవగాహన శిబిరంలో సెలబ్రిటీ సోహా అలీ ఖాన్, ఫిట్నెస్, సెలబ్రిటీ శిక్షకురాలు, యాస్మిన్ కరాచీవాలా, మాక్స్ హెల్త్ కేర్ రీజినల్ హెడ్ ఆఫ్ డైటెటిక్స్ రితికా సమద్దార్ మాట్లాడుతూ సంరక్షకులుగా, తల్లులు ఎల్లప్పుడూ తమ ఆరోగ్యం చూసుకోవాల్సి ఉంటుందని ఈ నేపథ్యంలో సరైన పోషకాలు కలిగిన బాదము లాంటివి ప్రతిరోజు తీసుకోవాలన్నారు. ఈ మదర్స్ డే నాడు వారి ఆరోగ్యం సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారి నిస్వార్థ ప్రయత్నాలను గుర్తించడానికి ఒక అవకాశం లభిస్తుందని, తల్లికి బహుమతిగా బాదం పప్పును బహుమతిగా ఇవ్వడం అనేది మంచి ఆరోగ్యాన్ని కోరుకున్న మారమవుతామన్నారు.

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

మండల ఎన్నికల అధికారి హేమంత్ కుమార్

విశాలాంధ్ర – ఆనందపురం: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లకు పటిష్టంగా చేపడుతున్నట్లు మండల ఎన్నికల అధికారి హేమంత్ కుమార్ తెలిపారు. మండలంలో 57 పోలింగ్ కేంద్రాలలో 50,582 ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి అన్ని రకాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రం లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతి కేంద్రంలో టెంట్లు, మంచినీరు సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. 800 మంది దాటిన కేంద్రానికి 6 మంది, 800 ఓటర్లు లోపు ఉన్న కేంద్రాలకు 5 మంది ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని రకాలు ఏర్పాట్లు చేసామని తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: మే 13న జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఆ దిశగా పటిష్ట ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. 20,12,373 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా మహిళలకు, పురుషులకు, వృద్ధులకు, వికలాంగులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు నుంచి సైలెంట్ పీరియడ్ అమలవుతుందని, 144 అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. మే 13న జరిగే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల గురించి శనివారం స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో పోలీస్ కమిషనర్ తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. జిల్లాలో 1991 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వాటి వద్ద 11 రకాల కనీస వసతులు కల్పించామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్ విధిస్తామని చెప్పారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా 13,069 మంది అధికారులను, సిబ్బందిని కేటాయించామని వివరించారు. అందులో 2,183 మంది పీవోలు, 2,192 మంది ఏపీవోలు, 8,694 మంది ఓపీవోలు ఉన్నారని తెలిపారు. అలాగే 126 మంది సెక్టోరల్ అధికారులు ఉన్నారని, 22 మంది ఏఆర్వోలు, 21 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. జిల్లాలో 152 సెక్టార్లు, 207 రూట్లు ఉన్నాయని, 847 కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 94.36 శాతం ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశామని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 20,998 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

ఏడు డిస్ట్రిబ్యూషన్, ఏడు రిసెప్షన్ కేంద్రాలు

పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేసేందుకు అనువుగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏడు, రిసెప్షన్ కేంద్రాలు ఏడు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. 12వ తేదీ ఉదయం 6.00 గంటల నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందజేస్తారని చెప్పారు. అలాగే 13వ తేదీ సాయంత్రం 6.00 గంటల నుంచి పోలింగ్ సిబ్బంది నుంచి రిసెప్షన్ కేంద్రం వద్ద మెటీరియల్ స్వీకరిస్తారని పేర్కొన్నారు. మెటీరియల్ ను, సిబ్బందిని తరలించేందుకు అనువుగా సుమారు 700 వాహనాలను అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

అన్ని నియోజకవర్గాలకు కలిపి 9,627 బ్యాలెట్ యూనిట్లను, 4,681 కంట్రోల్ యూనిట్లను, 5,040 వీవీప్యాట్లను అందజేశామని పేర్కొన్నారు. 1,457 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. 11 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళల చేత నిర్వహించేవి ఏడు, యువత ఆధ్వర్యంలో నిర్వహించేవి రెండు, వికలాంగుల ఆధ్వర్యంలో సాగేవి రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం వెయ్యి వీల్ ఛైర్లు సమకూర్చామన్నారు. వృద్ధులకు, వికలాంగులకు సహాయం అందించేందుకు గాను సుమారు 600 మంది ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్., విశ్రాంత అధికారులను సేవకులుగా వినియోగించుకోనున్నామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం ఎండ వేడిమి తగలకుండా షామియానాలు, తాగునీరు, బయోటాయిలెట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

మే 13న పెయిడ్ హాలిడే...

మే 13వ తేదీన ఆర్జిత సెలవుగా ప్రకటించామని, ఈ మేరకు కార్మిక శాఖకు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఆ రోజు అందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సంస్థల ఉద్యోగులకు, కార్మికులకు అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు నుంచి ఉన్న కాలపరిమితిని డ్రై డేగా ప్రకటించామని పేర్కొన్నారు. మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు.

కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. దానిలో భాగంగా పర్యవేక్షణ నిమిత్తం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక డిప్యూటీ కలెక్టర్, సీనియర్ అధికారుల పర్యవేక్షణలో 2407 గంటలు పాటు కంట్రోల్ రూమ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు 0891 – 2590100 ఫోన్ నంబర్ లేదా టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా సంప్రదించవచ్చునని సూచించారు.

20 లక్షల మంది ఓటు హక్కు వినియోగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల నిర్వహణకు మొత్తం 13,069 మంది అధికారులు, సిబ్బంది కేటాయింపు

పోలీస్ కమిషనర్‌తో కలిసి వివరాలు వెల్లడించిన జిల్లా ఎన్నికల అధికారి డా. ఎ.మల్లికార్జున

పరిశీలకులు అందుబాటులో ఉంటారు

జిల్లాలో పార్లమెంటు నియోజకవర్గ సాధారణ పరిశీల కులు అమిత్ శర్మ (63003 10152), పోలీసు పరిశీలకులు అమిత్ కుమార్ (63003 15841), వ్యయ పరిశీలకులు రెంగ రాజన్ (63003 01726), ఎస్.కోట, పశ్చిమ, గాజువాక నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు సీతారామ్ జాట్ (63003 20829), భీమిలి, తూర్పు, దక్షిణ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు సౌమ్య పాండే జైన్ (63003 16752), ఉత్తరం, పశ్చిమ, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు అక్షా జైన్ (63003 19204)లు జిల్లాలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

ప్రచార ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

12, 13 తేదీల్లో పత్రికల్లో ప్రచురించే రాజకీయ ప్రచార ప్రకటనలకు జిల్లా ఎంసీఎంసీ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. లేని యెడల ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు : పోలీసు కమిషనర్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీసు విభాగం తరఫున పటిష్ట ఏర్పాట్లు చేశామని పోలీసు కమిషనర్ డా. ఎ. రవిశంకర్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సుమారు మూడు వేల మందిని నియమించామని చెప్పారు. 10 సీఆర్పీఎఫ్ కంపెనీలు, ఒక ఏపీఎస్పీ కంపెనీ అందుబాటులో ఉంటాయన్నారు. వీరితో పాటు ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్., విశ్రాంత ఆర్మీ, విశ్రాంత పోలీసు అధికారులు 962 మందిని సేవకులుగా వినియోగిస్తున్నామని చెప్పారు. 476 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 5,290 మందిపై బైండోవర్ కేసులను పెట్టామని చెప్పారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు గాను స్ట్రైకింగ్ ఫోర్స్ అందుబాటులో ఉంటాయని, మొత్తం 194 రూట్ మొబైల్స్ అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. పోలింగ్ ఏజెంట్లు, సిబ్బందితో పాటు ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రం లోపలికి సెల్ ఫోన్లు తీసుకెళ్లరాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హోటళ్లు, లాడ్జీలు, ఫంక్షన్ హాళ్లలో ముందస్తు తనిఖీలు నిర్వహిస్తామని, అనుమానిత వ్యక్తులు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పాల్గొన్నారు.